క్లుప్తంగా

రేపు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

చీరాల: మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశాన్ని శనివారం మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ కె.చక్రవర్తి గురువారం తెలిపారు. సమావేశానికి మున్సిపల్ కౌన్సిలర్లు, కో–ఆప్షన్ మెంబర్లు, మున్సిపాలిటీలోని పలు విభాగాల అధికారులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

అక్రమ మద్యం అరికట్టేలా చర్యలు

కారంచేడు: గ్రామాల్లో అక్రమం మద్యం, అక్రమం మాదకద్రవ్యాల విక్రయానికి చెక్ పెట్టేలా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని ఎస్ఐ వీ వెంకట్రావు అన్నారు. గురువారం ఆయన మండలంలోని కుంకలమర్రు గ్రామంలో అక్రమంగా మద్యం అమ్మకాలు చేస్తున్నట్లు వచ్చిన సమచారాంతో దాడులు చేశామన్నారు. గ్రామంలోని మెయిన్ రోడ్డులో ఒక మహిళ తన గృహంలో మద్యం అక్రమంగా నిల్వలు చేసి అమ్మకాలు చేస్తుందన్నారు. సిబ్బందితో దాడి చేసిన సమయంలో ఆమె వద్ద ఉన్న 9 కార్టర్‌ల అక్రమం మద్యం సీసాలను గుర్తించి అరెస్టు చేశామన్నారు.

ఏపీ మోడల్ స్కూల్‌లో ఎన్‌సీసీ ప్రారంభం



ఎన్‌సీసీ జెండా ఎగురవేస్తున్న ఎన్‌సీసీ అధికారులు

చీరాల అర్బన్: చీరాలలోని ఏపీ మోడల్ స్కూల్‌లో 2024–25 విద్యా సంవత్సరం నుంచి నేషనల్ క్యాడెట్ కార్ప్స్ (ఎన్‌సీసీ)ని ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ జె.సరళ గురువారం తెలిపారు. స్కూల్‌లో 8, 9 తరగతుల విద్యార్థులను చీరాల 23 ఏ బెటాలియన్ ఎన్‌సీసీ అధికారులు సుబేదార్ ముఖేష్ కుమార్ జై, నాయబ్ సుబేదార్ రేఖారామ్‌లు అర్హత గలిగిన 30 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. అలానే పాఠశాలలో ఎన్‌సీసీ జెండాను ఎగురవేసి కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని, తెలుగు భాషా దినోత్సవాలను పురస్కరించుకుని సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఎన్‌సీసీలో ఎంపికైన విద్యార్థులను వైస్ ప్రిన్సిపాల్ శామ్యూల్ జాన్, ఎన్‌సీసీ కేర్ టేకర్ వి.రేణుక, ఉపాధ్యాయులు అభినందించారు.

వాకర్స్ సేవలు ఎనలేనివి



చీరాల రూరల్: ఆరోగ్యాలపై శ్రద్ధ చూపటమే కాకుండా సమాజ సేవలో కూడా ముందంజలో ఉన్న వాకర్స్ అసోసియేషన్ సభ్యులు ముందంజలో ఉండడం ఎంతో మంచి పరిణామమని స్థానిక ఎమ్మెల్యే మద్దులూరి మాల కొండయ్య అన్నారు. వాకర్స్ ఇంటర్నేషనల్, చీరాల ఎస్ఆర్అండ్‌పిఎం హైస్కూలు వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక రోటరీ కమ్యూనిటీ హాలులో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అన్నార్తులను ఆదుకునేందుకు తమ బాధ్యతగా భావించి అసోసియేషన్ సభ్యులు అందరి సహకారంతో అన్నా క్యాంటీన్ నిర్వహణకుగాను రూ. 1.50 లక్షల చెక్కును అందించడం ఎంతో అభినందనీయమని వాకర్స్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వలివేటి మురళి , రామకృష్ణ, గురుప్రసాద్, సుధాకర్, ఇస్తర్ల సుభాషిణి, డాక్టర్ ఇస్తర్ల బాబురావు వాకింగ్ సభ్యులు పాల్గొన్నారు.

శుభ్రతతో వ్యాధులు దూరం

చీరాల అర్బన్: వ్యక్తిగత శుభ్రతతో వ్యాధులు దూరమవుతాయని వక్తలు పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని ఉజిలిపేటలోని ఏయూపీ పాఠశాలలో 10–19 సంవత్సరాల కిశోర బాలికలకు రాష్ట్రీయ కిశోర శ్వాస్థ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కిశోర బాలికలలోని ఆరో తరగతి విద్యార్థిని యు.స్వాతి, ఏడో తరగతి విద్యార్థిని బి.వాసు సాయిలను పీర్ ఎడ్యుకేటర్స్‌గా ఎన్నుకున్నట్లు ఉజిలిపేట హెల్త్ సెక్రటరీ ఏ.కళ్యాణి తెలిపారు. కిశోర బాలబాలికలు ప్రతి సోమవారం, గురువారం ఐరన్ మాత్రలు విధిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం కె.జె.సుశీల స్వామి, ఏ.ప్రతాప్‌కుమార్, డి.శ్రీనివాసులు, ఎస్.శీలమ్మ పాల్గొన్నారు.

46 మద్యం సీసాలు స్వాధీనం

చీరాల: చీరాల రూరల్ మండలం వాడరేవులోని చిన్నబరపలో అక్రమంగా మద్యం సీసాలను నిల్వ చేసి అధిక ధరలకు అమ్ముతున్న మహిళ వద్ద నుంచి మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఈపూరుపాలెం ఎస్సై ఎంవీ శివకుమార్ గురువారం తెలిపారు. అందిన సమాచారం మేరకు ఆయన సిబ్బందితో కలిసి నిల్వ ఉంచిన మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. 30 లిక్కర్ బాటిళ్లు, 16 బీర్ సీసాలు మొత్తం 46 మద్యం సీసాలను సీజ్ చేసి కేసు నమోదు చేశామన్నారు. అక్రమంగా మద్యం నిల్వ చేసి అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.



మహిళా ఉద్యోగిగా మనుగడ సాగించడం కష్టమే..

విధుల్లో తీవ్రమైన ఆటంకాలు ఎదురవుతుంటే ఒక ఉద్యోగిగా మనుగడ సాగించడం కష్టంగా ఉంటోంది. ముఖ్యంగా వైద్య వృత్తిలో ఉన్న మాలాంటి మహిళలకు సమాజంలో ఒక గుర్తింపు ఉంటుంది. అటువంటి గుర్తింపు కలిగిన మాకే ఉద్యోగం చేయడం కష్టంగా మారితే మహిళలంటూ ఉద్యోగాలు మానుకోవాల్సిందే కదా. సమాజంలో మహిళా ఉద్యోగులు గురించి ఆలోచించాలి.

– రావూరి విజయలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ, పల్లెపాలెం, చినగంజాం పీహెచ్‌సీ



మారుమూల గ్రామాల్లో మాకు రక్షణ కావాల్సిందే..

మారుమూల గ్రామాల్లో ఒంటరిగా ఆసుపత్రిలో ఉద్యోగం చేసే మాకు రక్షణ తప్పనిసరిగా కావాల్సిందే. ఎటువంటి పరిస్థితుల్లోను మాకు మేము రక్షణ పొందాలంటే అవకాశాలు తక్కువగా ఉంటాయి. అటువంటి కష్టతరమైన సందర్భాల్లో ప్రభుత్వం రక్షణ చట్టాలను అమలులోకి తీసుకొని వచ్చి మమ్ముల్ని రక్షించాలి.

– తొట్టెంపూడి రమాదేవి, ఎంఎల్‌హెచ్‌పీ, చినగంజాం



మాతృభాషలోనే మానసిక వికాసం

- పండుగలా తెలుగు భాషా దినోత్సవం
- వాడుక భాషా పితామహుడు గిడుగు రామ్మూర్తి
- నివాళులర్పించిన విద్యార్థులు, ఉపాధ్యాయులు



పెదగంజాంలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న హెచ్ఎం ఉపాధ్యాయ సిబ్బంది

చీరాల: తెలుగును గ్రాంధిక భాష నుంచి వ్యావహారిక భాషలోకి తెచ్చిన పితామహుడు గిడుగు వెంకట రామ్మూర్తి పంతులు అని వక్తలు పేర్కొన్నారు. గురువారం తెలుగు వ్యావహారిక భాషా పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి జయంతి పురస్కరించుకుని గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా కార్యాలయంలోని తెలుగుతల్లి విగ్రహానికి మున్సిపల్ కమిషనర్ కె.చక్రవర్తి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిడుగు గ్రాంధిక వాదులతో 40 సంవత్సరాలు పోరాటం చేసి వ్యావహారిక భాషోద్యమాన్ని విజయవంతం చేశారన్నారు. దేశ భాషలందు తెలుగు లెస్స అని శ్రీకృష్ణ దేవరాయలు చెప్పిన వాక్యాన్ని గుర్తు చేస్తూ దేశంలో 22 అధికార భాషల్లో తెలుగు భాషకు మూలం ద్రావిడ భాష అని, ఆంధ్రప్రదేశ్ అధికారిక భాషా చట్టం ద్వారా 1966లో తెలుగును రాష్ట్ర అధికార భాషగా గుర్తించారన్నారు. కేంద్రపాలిత ప్రాంతం యానాంలో అధికార భాషగా, 2008లో కన్నడతో పాటు తెలుగును కూడా ప్రాచీన భాషగా గుర్తించారన్నారు. తెలుగు భాష కనుమరుగైపోకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో రిటైర్డు తెలుగు ఉపాధ్యాయులు సాయిబాబా, పాఠశాల విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు. కొత్తపేటలోని నారాయణ స్కూల్‌లో తెలుగుభాషా దినోత్సవం జరిపారు. మన్నం శ్రీనివాస్ వివిధ కార్యక్రమాల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.సాయి పావని, డీన్ ఎ.శ్రీకృష్ణమూర్తి, తెలుగు ఉపాధ్యాయులు జి.శ్రీనివాసరావులు పాల్గొన్నారు.

మహనీయుల ఆశయాలను అనుసరించాలి..

చినగంజాం/మార్టూరు/యద్దనపూడి/కారంచేడు: దేశం కోసం ప్రాణత్యాగాలను చేసిన ఎంతో మహనీయుల ఆశయాలను ప్రతి ఒక్కరూ అనుసరించాలని ఎంఈఓలు ఎంవీ సత్యన్నారాయణ, మొలబంటి వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక ఎమ్మార్సీలో ఏర్పాటు చేసిన తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా గిడుగు వెంకట రామ్మూర్తి, హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్‌ల చిత్రపటానికి నివాళులర్పించారు. గ్రాంధిక భాషలో ఉన్న తెలుగు వచనాలను ప్రజల వాడుక భాషలోకి తీసుకొచ్చిన మహనీయుడన్నారు. కార్యక్రమంలో కుంకలమర్రు సీసీ పాఠశాలలో హెచ్ఎం పీ నాగమణి, బాబూరావులు, నందిగుంటపాలెం ప్రాథమిక పాఠశాలలో పుష్పలత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. కొడవలివారిపాలెంలో హెచ్ఎం ఉమామహేశ్వరరావు విద్యార్థులకు బహుమతులు అందించారు.

★ చినగంజాం మండలంలోని పెదగంజాం జెడ్పీహెచ్ఎస్‌లో తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పాఠశాల ఆవరణలో గిడుగు రామ్మూర్తి, ధ్యాన్‌చంద్, తెలుగు తల్లి చిత్రపటాలకు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకొని పాఠశాలలోని విద్యార్థులకు కబడ్డీ, వాలీబాల్ పోటీలను వ్యాయామ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయుల సహకారంతో నిర్వహించి విజేతలకు రామదండు సేవా సభ్యులు బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా తెలుగు ఉపాధ్యాయులు నందం రమణమూర్తి, ఎన్ శ్రీ రమణ, వ్యాయామ ఉపాధ్యాయులు ఎం అనిల్ కుమార్‌లను హెచ్ఎం ఎం దేవదత్తం, పాఠశాల కమిటీ చైర్మన్ ఏ సుదర్శనరెడ్డి, ఉపాధ్యాయులు శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు.

★ పర్చూరులో శాతవాహన స్కూల్ వ్యవస్థాపకుడు తేళ్ల వెంకట రాము పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గిడుగు చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం కే జాన్ బోసు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఉప్పుటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో తెలుగు భాషా దినోత్సావాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీ పాఠశాల హెచ్ఎం వసుంధరా దేవి, ఆక్స్‌ఫర్డ్ చైర్మన్ గోరంట్ల సుబ్బారావు, డైరెక్టర్‌లు లక్ష్మయ్య, సుబ్బరామిరెడ్డి, ప్రిన్సిపాల్ షాపియా తదితరులు పాల్గొన్నారు.

★ యద్దనపూడి ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం రావి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో తెలుగుభాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గిడుగు చిత్రపటానికి నివాళులర్పించారు.

★ గ్రాంధిక భాషలో ఉన్న తెలుగు భాషను వచనంలోకి తీసుకొచ్చిన మహనీయుడు రామ్మూర్తి పంతులు అని ఇడుపులపాడు విద్యాపరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం పిడవర్తి పేరిరెడ్డి అన్నారు. పాఠశాల ఆవరణలో తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు.

★ తెలుగు భాష వ్యవహారిక పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి జయంతి సందర్భంగా మాతృభాషా దినోత్సవాన్ని మార్టూరు మండలంలోని కోనంకి, వలపర్ల, మార్టూరు, బొబ్బేపల్లి పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. కోనంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు పండిట్ పద్మావతి ఆధ్వర్యంలో గిడుగు చిత్రపటానికి నివాళులర్పించారు. ఈసందర్భంగా ప్రాచీన, ఆధునిక కవులు, రచయిత్రులతో ప్రత్యేకంగా తయారు చేసిన చిత్రపటాలను విద్యార్థులు ప్రదర్శించారు. విద్యార్థులకు వక్తృత్వం, వ్యాసరచన పోటీలు నిర్వహించి హెచ్ఎం బొప్పూడి బాలప్రసాద్ బహుమతులు అందజేశారు.

మాతృభాషను నిర్లక్ష్యం చేయొద్దు..

అద్దంకి రూరల్: ఎంతకష్టమైనా సరే మాతృభాషను నిర్లక్ష్యం చేయొద్దని వక్తలు పేర్కొన్నారు. సృజన, రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి, తెలుగులో మొదటి పద్య శాసనానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో సృజన కార్యదర్శి కె. అనిల్ కుమార్, రోటరీ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, కాకర్ల వెంకటేశ్వర్లు, షేక్‌మహమ్మద్ రఫీ, మల్లాది శ్రీనివాసరావు, కొల్లిపర నాగయ్య, అనంతు నాగేశ్వరరావు, లక్కరాజు శ్రీనివాసరావు, సృజన, సాహితీ మిత్రులు పాల్గొన్నారు. కేఆర్కే డిగ్రీ కళాశాలలో తెలుగుభాషా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు.



యద్దనపూడిలో గిడుగు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న హెచ్ఎం, విద్యార్థులు



కోనంకిలో కవులు, రచయితల చిత్రపటాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు



చీరాలలో తెలుగు తల్లి విగ్రహానికి పూలమాలలు వేస్తున్న మున్సిపల్ కమిషనర్



ఇంకొల్లులో గిడుగు గురించి విద్యార్థులకు వివరిస్తున్న హెచ్ఎం పేరిరెడ్డి



నందిగుంటపాలెంలో గిడుగుకు నివాళులర్పిస్తున్న ఎంఈఓ, విద్యార్థులు



పద్య శాసనం వద్ద పూలమాలలు వేస్తున్న సృజన, రోటరీ క్లబ్ సభ్యులు



భాషా దినోత్సవంలో పాల్గొన్న కేఆర్కే కలశాల విద్యార్థులు

క్రీడలతో మానసిక ఉల్లాసం



పంగులూరులో ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న క్రీడాకారులు



క్రీడాకారులను అభినందిస్తున్న కలెక్టర్ వెంకటమురళి



డీఈఓ, డిప్యూటీ డీఈఓల చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న రవి దేవరాజ్

- ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం
- ధ్యాన్‌చంద్ చిత్రపటానికి నివాళులు

జే.పంగులూరు: క్రీడలతోనే ప్రతి ఒక్కరికి మానసిక ఉల్లాసం లభిస్తుందని రాష్ట్ర ఖోఖో కార్యదర్శి మేకల సీతారామిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక మాగుంట సుబ్బరామిరెడ్డి, బాచిన నారాయణమ్మ జూనియర్ కళాశాలలోని ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీ ఆధ్వర్యంలో గురువారం జాతీయ క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఖోఖో క్రీడా ప్రాంగణంలో మేజర్ ధ్యాన్ చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా సీతారామిరెడ్డి మాట్లాడుతూ ధ్యాన్‌చంద్ జయంతిని జాతీయ క్రీడా దినోత్సవంగా జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో అంతర్జాతీయ క్రీడాకారుడు అట్ల శివనాగిరెడ్డి, జాతీయ క్రీడాకారులు ఎస్ అజేయ్, షేక్ ఆలినవాజ్, కె రామ్మోహన్, షేక్ ఆహ్మద్, జి శివ, ఎం ఫణికుమార్, ఆర్ సూరినాయుడు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు కలెక్టర్ అభినందనలు..

బాపట్ల జిల్లాలో జరిగిన జాతీయ క్రీడా దినోత్సవ కార్యక్రమంలో పంగులూరు ఎస్ఆర్ఆర్ ఖోఖో క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఏ శివనాగిరెడ్డి బంగారు పతకం సాధించిన (అంతర్జాతీయ క్రీడాకారుడు), జాతీయ స్థాయిలో బంగారు పతకాలు సాధించిన కె రామ్మోహన్, ఎం ఫణికుమార్‌లను జిల్లా కలెక్టర్ ఎస్ వెంకటమురళి, స్థానిక ఎమ్మెల్యే వేగేశ్న నరేంద్రవర్మ, జాయింట్ కలెక్టర్ బి సుబ్బారావు, డీఎస్ డీవో పాల్‌కుమార్, ఖోఖో కోచ్ జే పాల్ క్రీడాకారులను సన్మానించారు.

వలపర్ల పీఈటీకి స్పోర్ట్స్ ఎక్సలెన్సీ అవార్డు..

మార్టూరు: జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా మండలంలోని వలపర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు రవి దేవరాజ్ 2024కు సంబంధించి జిల్లా స్థాయి స్పోర్ట్స్ ఎక్సలెన్సీ అవార్డు అందుకున్నారు. జిల్లా కేంద్రం బాపట్లలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి నారాయణరావు, చీరాల డివిజన్ డిప్యూటీ డీఈఓ ఎం నిర్మల చేతుల మీదుగా రవి దేవరాజు అవార్డు అందుకున్నారు. ఈసందర్భంగా మండలంలోని ఉపాధ్యాయులు పాఠశాల విద్యార్థులు దేవరాజును అభినందించారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా మార్టూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సీఐ మద్దినేని శేషగిరిరావు ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం రూత్ మెర్సీ జాయ్, తెలుగు ఉపాధ్యాయులు చట్టి శ్రీనివాసరావు, రాజ్యలక్ష్మి, ఇతర ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త అవసరం



వంకాయలపాడులో పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్న సిబ్బంది



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి విజయభాస్కర్

చినగంజాం: ప్రజలు జ్వరాలు సోకిన వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని వైద్యాధికారి ఎస్ విజయభాస్కర్ తెలిపారు. గురువారం చినగంజాం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని కోడూరి వారిపాలెం, కొత్త గొల్లపాలెం, పెదగంజాం, సోపిరాల గ్రామాల్లో గురువారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ జ్వరాలు సోకిన వారికి ఆసుపత్రిలో రక్త పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తారని, ప్రతి ఒక్కరు వైద్యశాలకు వచ్చి పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో పెదగంజాం సర్పంచ్ నక్కల కృష్ణ, పంచాయతీ కార్యదర్శి ఎస్‌కే సల్మా, ఏఎన్ఎంలు నాగుల కోటేశ్వరి, రమాదేవి, సీహెచ్ఓ ఫాతిమా, 104 సిబ్బంది పొదిలి రాఘవ, మహేష్ పాల్గొన్నారు.

✦ ఇంకొల్లు మండలంలోని వంకాయలపాడు గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మూడో రోజు వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యాధికారులు డాక్టర్ అంజలి, డాక్టర్ భానుప్రకాష్‌లు శిబిరంలో రోగులకు వైద్య చికిత్స అందించారు. 21 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.

విత్తనశుద్ధితో తెగుళ్ల నివారణ

అద్దంకి రూరల్: విత్తనశుద్ధితో తెగుళ్ల నివారించుకోవచ్చని మండల వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకట కృష్ణ అన్నారు. గురువారం మండలంలోని కలవకూరు గ్రామంలోని వరిపంటలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వ్యవసాయాధికారి మాట్లాడుతూ వరి కేజీ విత్తనానికి 5 గ్రాముల సూడోమోనాస్‌తో విత్తన శుద్ధి చేసుకుంటే అగ్గి తెగులు, పాముపొడ తెగులు నివారించుకోవచ్చని తెలిపారు. విచ్చలవిడిగా రసాయన ఎరువులు, పురుగుమందులు వాడకం వలన భూమి ఆరోగ్యం, మనుషుల ఆరోగ్యం పాడైపోతుందన్నారు. ఏఓఈ కోటేశ్వరరావు, వీఏఏ మస్తాన్‌రావు పాల్గొన్నారు.

రేపటి నుంచి పింఛన్ల పంపిణీ

మేదరమెట్ల: ఈనెల 31వ తేదీనే మండలంలోని పింఛను లబ్ధిదారులకు పింఛను సొమ్ము అందజేయనున్నట్లు ఎంపీడీవో సురేష్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబరు ఒకటో తేదీ ఆదివారం సెలవు దినం కావడంతో శనివారం ఉదయం నుంచి పింఛను సొమ్ము పంపిణీ చేయనున్నట్లు, పింఛనుదారులు అందుబాటులో ఉండాలని కోరారు. అలా లేనివారు సెప్టెంబర్ రెండో తేదీన పింఛను సొమ్మును అందజేస్తామని ప్రకటనలో తెలిపారు.

అన్ని దానాల్లో కెల్లా నేత్ర దానం గొప్పది



అవగాహన కల్పిస్తున్న కంటివైద్యుడు డాక్టర్ రాజ్‌కుమార్

చీరాల రూరల్: అన్ని దానాల్లో కెల్లా నేత్రదానం గొప్పదని.. ఒకరు నేత్రాలు దానం చేయడం వలన ఇద్దరు శాశ్వతంగా కంటిచూపు పొందవచ్చునని కంటి వైద్యుడు డాక్టర్ రాజ్‌కుమార్ అన్నారు. నేత్రదాన పక్షోత్సవాలు పురస్కరించుకుని గురువారం స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో నేత్రదానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజ్‌కుమార్ నేత్రాలు దానం చేయడం వలన ఎవరికి ఉపయోగపడతాయేననే విషయాలపై అవగాహన కల్పించారు. మానవ శరీరంలో నేత్రాలు అనేవి అత్యంత ప్రధానమైనవని చెప్పారు. నేత్రాలను ప్రతిరోజు ఎంతో పవిత్రంగా, పరిశుభ్రంగా చూసుకోవాలని సూచించారు. కంటిచూపు లేకపోతే జీవితాలు అంధకార మయమవుతాయని చెప్పారు. ఈ నేత్రదాన పక్షోత్సవాలు ప్రతిఏడాది ఆగస్టు 25 నుండి సెప్టెంబర్ 8 వరకు నిర్వహిస్తారని చెప్పారు. సదస్సులో డాక్టర్ స్వేష్ణ, ఆఫ్తాలిక్ ఆఫీసర్స్ పి. వెంకటేశ్వర్లు, ఎస్. సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

బైకు కవర్‌లో నుంచి నగదు అపహరణ

అద్దంకి రూరల్: టీ తాగుదామని ఆపి ఉంచిన బైక్‌లో నుంచి నగదును ఎత్తుకెళ్లారు దుండగులు. బాధితుడి వివరాల మేరకు మండలంలోని కలవకూరు గ్రామానికి చెందిన బిక్కా అంజిరెడ్డి గురువారం అద్దంకిలోని ఎస్బీఐ బ్యాంకులో నగదు తీసుకుని బైకు కవర్‌లో పెట్టుకుని గ్రామానికి వెళ్తున్నాడు. మార్గమధ్యంలో భవాని సెంటర్ దాటిన తరువాత ఉన్న హోటల్ వద్ద టీ తాగేందుకు బైకును పక్కన ఆపాడు. టీ తాగుతుండగా ఓ గుర్తు తెలియని వ్యకిత బైకు కవర్‌లో ఉన్న రూ. 2.50 లక్షలు తీసుకుని పరుగెత్తాడు గమనించిన అంజిరెడ్డి పట్టుకోవటానికి పరుగెత్తగా ఆ వ్యక్తి వేరే వ్యక్తి బైకు ఎక్కి ఉడాయించాడు. ఈ మేరకు అంజిరెడ్డి అద్దంకి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు ఎస్సై ప్రవీణ కేసు నమోదు చేశారు .

పేద విద్యార్థులకు ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న రోటరీ సభ్యులు

పర్చూరు (చినగంజాం): కాలేజీ బస్సు ఫీజు చెల్లించలేని విద్యార్థికి దాతలు సాయం అందించారు. పర్చూరుకు చెందిన కుంచాల ఓంకార్ చీరాల సెయింట్స్ ఆన్స్ ఇంజినీరింగ్ కాలేజీలో రెండవ సంవత్సరం చదువుతున్నాడు. ఇబ్బంది పడుతున్న తరుణంలో పర్చూరు రోటరీ క్లబ్ అతనికి ఆర్థిక సహాయం చేసి ఆదుకున్నారు. పర్చూరు రోటరీ క్లబ్ అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్ అతనికి గురువారం స్థానిక రోటరీ క్లబ్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో రూ.15 వేలు చెక్ అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి కోమటి ఆంజనేయులు, సభ్యులు పాబోలు ఉదయభాస్కర్, పోలిశెట్టి చంద్రశేఖర్, కోట శ్రీనివాసరావు, కాసా అశోక్, కారుమూడి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.